నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ విజయపురి ఫీడర్ మరమ్మతుల కారణంగా విజయపురికాలనీ, ఉప్పల్ బగాయత్, సాయిబాబాకాలనీ, సరస్వతి కాలనీ, సూర్యానగర్ కాలనీ, ఉప్పల్ ఆర్‌టీఏ కార్యాలయం, నాగోల్ మెట్రో స్టేషన్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. లక్ష్మారెడ్డి కాలనీ, విజయపురి కాలనీ, రాఘవేంద్రానగర్, పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వీధి, హనుమసాయినగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

కార్తికేయనగర్ ఫీడర్ పరిధిలో..

మల్లాపూర్: కార్తికేయనగర్ ఫీడర్ పరిధిలో కార్తీకేయనగర్, వీరారెడ్డి నగర్, అంబేడ్కర్‌నగర్, నాచారం మెయిన్‌రోడ్ ఏరియాలో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగరాజు తెలిపారు.

మల్లికార్జున్ ఫీడర్ పరిధిలో..

బోడుప్పల్: మల్లికార్జున్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. మల్లికార్జున్‌నగర్, కుమ్మరికుంట, చిలుకానగర్, న్యూ రాంనగర్, శివాలయం ఏరియా, ప్రభుత్వ స్కూల్ ప్రాంతంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బోడుప్పల్ కమిషనర్‌గా శైలజ



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎ.శైలజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బోడుప్పల్ కమిషనర్ రామలింగం భువనగిరి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. బోడుప్పల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు అందిరిని కలుపుకుని పని చేస్తామన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కుషాయిగూడ: ఈసీఐఎల్‌లోని గన సొసైటీలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సొసైటీ ప్రతినిధి హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలను వివరాలకు ఫోన్ నం. 91000 56583లో సంప్రదించాలన్నారు.

వంద డప్పులతో మందకృష్ణ మాదిగకు స్వాగతం



ఉప్పల్ చౌరస్తా దప్పు మోగిస్తున్న మందకృష్ణ మాదిగ

ఉప్పల్: ఎల్‌బీ స్టేడియంలో ఫిబ్రవరి 7న నిర్వహించే 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు'బహిరంగ సభను విజయవంత చేయాలని ఎమ్మార్పీఎస్‌నేత మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. జనగాంలో నిర్వహించే ప్రచార కార్యక్రమానికి వెళ్తున్న మంద కృష్ణమాదిగకు శుక్రవారం ఉప్పల్ చౌరస్తాలో స్థానిక నేతలు వంద డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ దప్పు కొట్టి అందరినీ చైతన్య పరిచారు. అంతకు ముందు చిలుకానగర్ ఎస్సీ మాదిగ సంక్షేమ సంఘ కార్యాలయం నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు డప్పులు వాయిస్తూ నేతలు ర్యాలీ వెళ్లారు. ఈ కార్యక్రమంలో వీబీ నర్సింహ, బొల్ల లక్ష్మణ్, రామ్ చల్ల బలరాం, అంతగల్ల అశోక్, మారపాక సాయిలు, పల్వాటి కిష్టయ్య, రాంచందర్, డెవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



డ్రైవర్లను సత్కరిస్తున్న ఎస్సై ఉదయ్ భాస్కర్, డీఎం కవిత

బోడుప్పల్: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని మేడిపల్లి ఎస్సై ఉదయ్‌భాస్కర్ అన్నారు. చెంగిచర్ల డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని అననఆరు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లను సత్కరించి వారికి ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చెంగిచర్ల డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌గౌడ్ తదితరులు



మహాబోధి విద్యాలయంలో గద్దర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ



తెలంగాణ ఉద్యమంలో.. గద్దర్ పాత్ర కీలకం

మల్లాపూర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు చేపట్టిన ఉద్యమంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పాత్ర వెలకట్టలేనిదని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. నాచారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొల్లం నరేష్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ... తన ఆటపాటలతో ఉర్రూతలు ఊగించి ఉద్యమాన్ని ఉవ్వెత్తున్న ఎగిసి పడేలా చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత కృష్టారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నూతన కంటి రాజు, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్,ఎస్సీ సెల్ ప్రధాన కార్య దర్శి చిలుక నరేష్, సుజాత, వెంకటేష్, సంతోష్‌రెడ్డి, కాంత్రి కిషోర్, చందు నాయక్, బాలుయాదవ్, నర్సింగ్ రావు, సత్యనారయణ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి గద్దర్



యాదమ్మనగర్‌లో గద్దర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెన్నెల గద్దర్, కాంగ్రెస్ నాయకులు

అల్వాల్: ప్రజా గాయకుడు గద్దర్ జయంతిని పురస్కరించుకుని యాదమ్మనగర్‌లోని ఆయన విగ్రహం వద్ద తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల గద్దర్ హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి గద్దర్ ఊపిరి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ-బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, శేఖర్, నాగేశ్వర్‌రావు, రాజసింహారెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వీనస్ మేరీ, శకుంతలనాయుడు, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాబోధి విద్యాలయంలో...

వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయలోని గద్దర్ స్మృతివనం వద్ద గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌కి చెందిన పలువురు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం కిరణ్‌కుమార్‌కు రూ.60 వేలు, అక్షయ్ యాదవ్‌కు రూ.20,500ల చెక్కులు మంజూరు అయ్యాయి. బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సదరు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం పరశురాంరెడ్డి, తులసి సురేష్, బాలకృష్ణ గుప్తా, ఫరీద్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గౌతంనగర్: అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్‌కి చెందిన పలువురు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదు



రామంతాపూర్: భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో విద్యార్థుల రూపొందించిన నమూనాల ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ అనేది ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. అది అందరిలో ఉంటుందని దానిని వెలికితీస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కృషి చేయాలని సూచించారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ.. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక నమూనాలను చూస్తుంటే వీరిలో ఇంత ప్రతిభ ఉందా అని ఆశ్చర్యమేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ సూరం రామ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమతా రామ్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడ్, ఎంఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లు చెల్లించమన్నందుకు లైన్‌మెన్‌పై దాడి

నిందితుడిపై కేను నమోదు చేసిన పోలీసులు

మల్కాజిగిరి: విద్యుత్ బకాయిలు ఉన్న వ్యక్తిని బిల్లు చెల్లించమని అడిగినందుకు ఏఎల్‌ఎంపై దాడి చేసిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం... వసంతపురి సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలో రెడ్యానాయక్ ఏఎల్‌ఎం(అసిస్టెంట్ లైన్‌మెన్)గా పనిచేస్తున్నాడు. ఈనెల 30వ తేదీ వసంతపురి కాలనీలో విద్యుత్ బకాయిలు ఉన్న సందీప్ అనే వినియోగదారుడి ఇంటికి విద్యుత్‌సరఫరా నిలిపివేశాడు. అదే ప్రాంతంలో కిరాణ దుకాణం వద్ద ఉన్న రెడ్యానాయక్ వద్దకు వచ్చిన సందీప్ దూషించడమే కాకుండా దాడి చేశాడు. రెడ్యానాయక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెళ్లి సందీప్‌ను ప్రశ్నించగా వారిని కూడా దూషించాడు. ఈ సంఘటన పై రెడ్యానాయక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపడుతున్న సిబ్బంది.. పట్టించుకోని ఉన్నతాధికారులు

మల్కాజిగిరి సబ్ డివిజన్ పరిధిలో వారం రోజుల్లోనే రెండు సంఘటనలు జరిగాయి. ఇప్పటికే పలు సబ్‌స్టేషన్లలో బిల్లు వసూళ్ల కోసం సిబ్బందిపై ఒత్తిడి తీసుకొని రావడంతో పాటు కొన్నిసార్లు దుర్భాషలాడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసూళ్లకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉందన్నారు. రెండు సంఘటనలు జరిగినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం.

గంజాయి విక్రేతల అరెస్ట్

మల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరూ వ్యక్తులను నాచారం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



పోలీసుల అదుపులో నిందితులు

నాచారం సావర్కర్‌నగర్ కనక దుర్గా వైన్స్ ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై వెంకటయ్య, సిబ్బంది కాపుకాచి ఇద్దరిని అరెస్ట్ చేశారు. నాచారం బాబానగర్‌కు చెందిన వెంకటేష్ కుమారుడు దుర్గా ప్రసాద్ అలియాస్ చింటూ(22), బాబానగర్‌కు చెందిన చిట్యాలస్వామి కుమారుడు దీపక్ (31) ఇద్దరూ స్నేహితులు. వీరికి గంజాయి తాగే అలవాటు ఉంది. రాఘవేంద్రనగర్‌కు చెందిన కర్రీ శివాజీతో పరిచయం అయ్యింది. అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కర్రీ శివాజీతో కలిసి కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. కర్రీ శివాజీ ఒరిస్సా నుంచి గంజాయిని దిగుమతి చేసుకుంటున్నాడు. 2 కిలోల గంజాయి కొనుగోలు చేసి చిట్యాల దీపక్ ఇంట్లో నిల్వ ఉంచి అమ్ముతుండగా నాచారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు కుక్కర్ అందజేత

మల్లాపూర్: మల్లాపూర్ సెక్టార్‌లోని మల్లాపూర్ 4వ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రానికి సామాజిక వేత్త భ్రమరాంబ, మల్లేష్ పప్పుకుక్కర్‌ను అందజేశారు. పిల్లలకోసం పప్పుకుక్కర్‌ను అందజేసినందకు అంగన్‌వాడీ టీచర్ కృతజ్ఞతాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మమత, ఆయా సుల్తానా, తదితరులున్నారు.

పట్ట పగలే చైన్ స్నాచింగ్

ఉప్పల్: రామంతాపూర్‌లో పట్ట పగలు ఇంట్లో నిద్రస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెల తాడు తెంపుకుని పారిపోయిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో అనంతయ్య భార్య అమృతమ్మ (75) ఇంట్లో నిద్రిస్తోంది. పట్ట పగలే ఇంట్లోకి వచ్చిన అగంతకుడు వృద్ధురాలి మెడలో నాలుగున్నర తులాల పుస్తెల తాడును తెంపుకుని పారిపోయాడు. దీంతో వృద్ధురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్‌రెడ్డి

కుషాయిగూడ: కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.భాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ అంజయ్యను షీటీమ్‌కు బదిలీ చేశారు. ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ రెడ్డిని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

గద్దర్‌కు భారత రత్న ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత గద్దర్‌కు భారత రత్న అవార్డును ప్రకటించాలని బీసీ ఆజాద్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన గద్దర్ 77వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

నాలా కబ్జాల కట్టడిలో అధికారులు విఫలం



మారుతీనగర్ కల్వర్టుపై నిరసన తెలుపుతున్న నాలా పరీవాహక ప్రజలు

కుషాయిగూడ: కాప్రా చెరువు నాలా పరిరక్షణ, నాలా పొడవునా కబ్జాలను కట్టడి చేయడంలో జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు విఫలమయ్యారని నాలా పరిసర కాలనీల ప్రజలు శుక్రవారం నిరసనకు దిగారు. చక్రిపురం సాకేత్ మార్గంలోని మారుతీనగర్ కల్వర్టు వద్ద భవన నిర్మాణ, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయిందన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. దీంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాలను కబ్జాల నుంచి పరిరక్షించాలన్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, విద్యాసాగర్, రమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్కను జేసీబీతోనే తొలగించాలి



ఎర్రకుంట చెరువు వద్ద కార్మికులతో మాట్లాడుతున్న వీఎస్ బోస్

మల్లాపూర్: నాచారం ఎర్రకుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను జేసీబీతోనే తొలగించాలని కార్మికుల చేత తీయించడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్ బోస్ అన్నారు. నాచారంలోని ఎర్రకుంట చెరవును పరిశీలించారు. ఈ సందర్భంగా బోట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీఎస్ బోస్ మాట్లాడుతూ.. ఎంటమాలజీ విభాగం అధికారులు కార్మికుల విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనబర్చొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్‌రావు, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, సీపీఐ నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



త్రిదండి చినజీయర్ స్వామికి స్వాగతం పలుకుతున్న ఆలయ వేదపండితులు

కుషాయిగూడ: మంగాపురం కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం త్రిదండి చినజీయర్‌స్వామి ఆలయానికి వచ్చారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. రాత్రి ఆయన ఇక్కడే బస చేస్తారని ఈఓ ఏబీ రవీంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం శిఖర ప్రతిష్ఠ చేస్తారని అన్నారు. మంత్రి కొండా సురేఖ సైతం ఈ పూజల్లో పాల్గొంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్ల కింద యథేచ్ఛగా నిర్మాణాలు

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు



ఉప్పల్ ధర్మపురికాలనీలో హైటెన్షన్ వైర్ల కింద కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. చిలుకానగర్ డివిజన్ బీరప్పగడ్డ ప్రాంతంలో ఇళ్ల మీద నుంచి హైటెన్షన్ వైర్లు వెళ్తున్నాయి. ఇప్పటికే ప్రతి సంవత్సరం ఒకరిద్దరు వీటి బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఒక్క పక్క వాటిని తొలగించాలనే డిమాండ్ స్థానికుల నుంచి ఉన్నా మరో పక్క అదే హైటెన్షన్ వైర్ల కింద ప్రమాదకరంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ ధర్మపురికాలనీ ప్రశాంత్‌నగర్ రోడ్ నం.2లో ఏకంగా హైటెన్షన్ వైర్ల కిందనే కొన్ని రోజులుగా యథేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకుని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు..

ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు తెలిపారు. ఇచ్చినా వాటిని పునఃపరిశీలిస్తామని తెలిపారు. వెంటనే పనులను నిలిపివేసి నిర్మాణదారులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

తాగునీటి పైప్‌లైన్ లీకేజీ, డ్రైనేజీ మరమ్మతులు చేయించిన అధికారులు

ప్రధాన రహదారిలో బస్టాండ్ వద్ద తాగునీటి పైప్‌లైన్లు 15 రోజులుగా నీరు ఏరులై పారుతున్నాయి. దీనిపై ఈనెల 26వ తేదీన 'సమస్యలపై స్పందించరూ..'అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం జలమండలి అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. అదే విధంగా రామంతాపూర్ కేసీఆర్‌నగర్ నుంచి నాగోల్ మెట్రో వరకు వెళ్లే ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా మురుగు పొంగిపొర్లుతోంది. దీనిపై సైతం సాక్షిలో కథనం రావడంతో అధికారులు మురుగు సమస్యను పరిష్కరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సాక్షి కథనాలు వెలుగులోకి తీసుకురావంతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. – రామంతాపూర్



వృథాగా పోతున్న తాగునీరు (ఫైల్)



మరమ్మతులు చేసిన జలమండలి సిబ్బంది



కేసీఆర్‌నగర్ సర్వీస్ రోడ్డులో మురుగు సమస్యను పరిష్కరిస్తున్న దృశ్యం